నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 24 ఆగస్టు 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## జనావాసాల్లోకి అలుగు



అలుగును పరిశీలిస్తున్న అధికారులు

మందమర్రి రూరల్, ఆగస్టు 24 : పట్టణంలోని జాతీయ రహదారిలో టోల్ ప్లాజా సమీపంలోని జనావాసాల్లోకి శుక్రవారం అలుగు (పంగోలిన్) వచ్చింది. అక్కడ ఓ షాపు నిర్వాహకుడికి అలుగు కనిపించడంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. వారు వచ్చి అలుగును పట్టుకున్నారు. అనంతరం బొక్కలగుట్ట వద్ద గాంధారి వనంలోని అటవీ ప్రాంతంలో దానిని వదిలివేశారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌లు సంతోష్, అజర్, ఎఫ్ఎస్‌వో పోశెట్టి, ఎఫ్‌బీవో రాజేశ్వరి ఉన్నారు.

## కవ్వాల్‌లో గడ్డిక్షేత్రాలను పరిశీలించిన ఎఫ్‌డీపీటీ

జన్నారం, ఆగస్టు 23 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్‌లో ఇందన్‌పెల్లి రేంజ్ పరిధిలోని అడవుల్లో పెంచుతున్న గడ్డి క్షేత్రాలను ఎఫ్‌డీపీటీ శాంతారామ్ శుక్రవారం పరిశీలించారు. అడవుల్లో పెంచుతున్న బొంగు వనాలు, గడ్డి క్షేత్రాల పెంపకం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో వన్యప్రాణుల సంఖ్య పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌వో శివ్‌ఆశీస్‌సింగ్, రేంజ్ ఆఫీసర్ హఫీసొద్దీన్, ఎఫ్ఎస్‌వో తిరుపతి ఉన్నారు.



గడ్డి క్షేత్రాలను పరిశీలించిన ఎఫ్‌డీపీటీ శాంతారామ్

# అన్ని అర్హతలున్నా అనర్హులే!

● రుణమాఫీపై రైతన్నల నిరాశ ● వ్యవసాయశాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు ● రైతు వేదికలకు తరలివచ్చి ఫిర్యాదులు ● కాంగ్రెస్ నమ్మించి మోసం చేసిందంటూ మండిపాటు

***కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ రైతాంగంలో నిరాశ నింపింది. అన్ని అర్హతలున్నా రూ. 2 లక్షల రుణాలు మాఫీకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ అష్టకష్టాలు పడుతున్నది. రుణమాఫీ కోసం రైతు వేదికలకు తరలివచ్చి ఫిర్యాదులు చేస్తున్నది. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు నాలుగు వేల వరకు దరఖాస్తులు అందినట్లు తెలుస్తున్నది. రూ. 50 వేల లోపు రుణం ఉండి కూడా మాఫీకాని రైతులు వందల సంఖ్యలో ఉండడం గమనార్హం. జైనూర్ రైతు వేదికలో 62 మంది, రెబ్బెనలో 341 మంది, పెంచికల్‌పేట్‌లో 47 మంది, చింతలమానేపల్లిలో 78 మంది, కౌటాలలో 145 మంది, కాగజ్‌నగర్‌లో 150 మంది, బెజ్జూర్‌లో 150 మంది, కెరమెరిలో 300 మంది, తిర్యాణిలో 96 మంది, దహెగాంలో 342 మంది, మిగతా మండలాల్లో 2289 దాకా రైతులు ఫిర్యాదులు చేశారు. రోజు రోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరిగిపోతున్నది. కాంగ్రెస్ సర్కారు వందలో ఓ ముప్పై మంది కి రుణమాఫీ చేసి గొప్పలు చెప్పకుంటున్నదని రైతులు మండిపడుతున్నారు.***

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ)*



### అధికారుల చుట్టూ తిరుగుతున్న



నాపేర రూ. లక్షా 50 వేలు, నా భార్య పద్మ పేరిట రూ. లక్షా 43 వేల రుణం ఉంది. రెండో విడుతలోనే పంటరుణం మాఫీకావాలి. కానీ కాలేదు. మా ఇద్దరి పేరిట లోన్‌లు రూ. 2 లక్షలు దాటుతున్నాయని అధికారులు చెప్పడంతో వెంటనే రూ. లక్ష ముందుగానే బ్యాంకులో కట్టిన. అయినప్పటికీ లోన్ మాఫీకాలేదు. సర్కారు రుణం మాఫీ చేయకపోగా.. నేనే తిరిగి రూ. లక్ష కట్టాల్సి వచ్చింది. సమస్య చెప్పుకునేందుకు గిట్లా అధికారుల చుట్టూ తిరుగుతున్న.

*-రైతు శంకర్, బాలాజీ అనుకోడ, చింతలమానేపల్లి*



### రూ. 43 వేలే మాఫీ కాలే



నాకు రూ. 43,177 రుణం మాత్రమే మొదటి విడుతలోనే రుణం మాఫీ కావాలి. కాని ఇప్పటి దాకా కాలే. రెండు నెలలుగా అధికారుల చట్టూ తిరుగుతున్న. ఎందుకు రుణమాఫీకాలేదో అధికారులు చెప్పడం లేదు. డాక్యుమెంట్లలో ఏమైనా తప్పులున్నాయో కూడా చెప్పడం లేదు. కాంగ్రెస్ మమ్ముల నమ్మించి మోసం చేసింది.

*- అజ్మీరా కృష్ణ, చింతకుట, సిర్పూర్-టీ*

### కాంగ్రెస్ నమ్మించి మోసం చేసింది



కాంగ్రెస్ ఎన్నికలకు ముందు రైతులందరికీ రుణాలు మాఫీ చేస్తామని చెప్పింది. అధికారంలోకి రాగానే నమ్మించి మోసం చేసింది. నాకు రూ. 61,428 రుణం మాత్రమే ఉంది. మొదటి విడుతలోనే మాఫీకావాలి. కానీ ఇంతవరకు కాలేదు. నెల రోజుల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. పనులన్నీ వదిలేసి రుణమాఫీకోసం తిరుగాల్సి వస్తోంది.

*-బానోత్ సరోజ, చింతకుట, సిర్పూర్-టీ*

### ఇది ఎగ్గొట్టే ప్రయత్నమే



నాకు రూ. 99 వేల రుణం ఉంది. అన్ని అర్హతలున్నా మాఫీకాలే. ఎందుకు కాలేదో అధికారులు కూడా చెప్పడం లేదు. మాకున్న మూడెకరాల్లో ఎవుసం చేసుకొని బతికేటోళ్లం. వ్యవసాయ పనులన్నీ వదులుకొని ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఎన్నికలకు ముందు అందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఆంక్షలు పెట్టి ఎగ్గొట్టే ప్రయత్నాలు చేస్తున్నది.

*-అజ్మీరా కుమారీబాయి, చింతకుంట, సిర్పూర్-టీ*



బ్యాంకులో విచారణ చేపడుతున్న రీజినల్ మేనేజర్ రితీశ్

## 'డబ్బులిస్తేనే రెన్యూవల్'పై విచారణ

**జన్నారం ఎస్‌బీఐలో వివరాలు సేకరించిన రిజినల్ మేనేజర్**

జన్నారం, ఆగస్టు 23 : జన్నారం మండలం హాస్టల్‌తండాకు చెందిన మ్యాక ఎర్రయ్యకు రూ. 1.50 లక్షల రుణమాఫీ వచ్చింది. రెండు రోజులుగా మండల కేంద్రంలోని ఎస్‌బీఐ చుట్టూ తిరుగుతున్నా రెన్యూవల్ చేయడం లేదు. ఈ క్రమంలో రూ. 20 వేల లంచం ఇస్తేనే రెన్యూవల్ చేస్తామని బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్‌కు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి పరంకుస సాయిరామ్ స్పష్టం చేశాడు. దీంతో గురువారం మధ్యాహ్నం సదరు రైతు ఎర్రయ్య ఉద్యోగికి రూ. 15 వేలు ఇచ్చాడు. ఈ విషయం తెలిసిన పలు గ్రామాల రైతులు బ్యాంక్ వద్దకు చేరుకొని మేనేజర్ మహేశ్‌తో వాగ్వాదానికి దిగిన విషయం విదితమే. ఈ విషయమై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో 'డబ్బులిస్తేనే రుణమాఫీ రెన్యూవల్' పేరిట కథనం ప్రచురితమైంది. ఈ మేరకు మంచిర్యాల ఎస్‌బీఐ బ్యాంక్ రిజనల్ మేనేజర్ రితీశ్ ఎస్‌బీఐని సందర్శించి విచారణ చేపట్టారు. బ్యాంక్ సిబ్బంది పనితీరు ఎలా ఉందని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డబ్బులు ఇచ్చిన రైతు ఎర్రయ్యతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కంట్రాక్ట్ ఉద్యోగి సాయిరామ్‌ను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆపై అక్కడి నుంచి వెళ్లిపోయారు.



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## సలహాలను సీసీఎల్ఏకు నివేదిస్తాం

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ● ఆర్వోఆర్ చట్టం ముసాయిదాపై చర్చ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 23 : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం ముసాయిదాపై సూచనలు, సలహాలు అందజేయాలని, వాటిని నివేదిక రూపంలో సీసీఎల్ఏకు అందజేస్తామని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి నూతన ఆర్వోఆర్ చట్టం ముసాయిదాపై విశ్రాంత రెవెన్యూ అధికారులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, నిపుణులతో చర్చ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన చట్టం రూపకల్పనలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలనే ఉద్దేశంతో ఈ చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ రికార్డుల నిర్వహణ కోసం ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు తమ సలహాలు, సూచనలు రాతపూర్వకంగా కలెక్టరేట్‌లో అందించినట్లయితే వాటిని ఒక నివేదిక రూపంలో సీసీఎల్ఏకు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సలహాలు, సూచనలు వెల్లడించారు. ఆబాది భూముల రికార్డులను ఆధునీకరించడం, సాదా బైనమా, భూముల రిజిస్ట్రేషన్ రుసుము వసూలు చేయడం, అనుభవదారుడి కాలమ్ ఉండడం, అప్పీల్ అథారిటీ ఆర్డీవో చేతుల్లో ఉండాలని, ప్రతి గ్రామానికి రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు తీసుకోవడం, భూ సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో అప్పిలేట్ అథారిటీ, ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చట్టాన్ని రూపొందించడంవంటి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## సమస్యలపై నివేదికలందిస్తాం

రెబ్బెన, ఆగస్టు 23 : మండలంలోని పలు పాఠశాలలను తనిఖీ చేశామని, ఆయాచోట్ల నెలకొన్న సమస్యలపై నివేదికలు రూపొందించి సివిల్ సప్లయ్ కమిషనర్‌కు పంపిస్తామని డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ వినోద్ పేర్కొన్నారు. శుక్రవారం రెబ్బెన మండలంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కేజీబీవీ, గోలేటి ఐటీడీఏ ఆశ్రమ పాఠశాలలతో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్న బియ్యం, పప్పులు, పాలు, కొడిగుడ్లు, నూనెవంటి వాటిని పరిశీలించి నాణ్యత గురించి తెలుసుకున్నారు. రికార్డుల్లో స్టాక్ వివరాల గురించి ఆరా తీశారు. గంగాపూర్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో పద్మ ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ వినోద్



నిరసన తెలుపుతున్న అతిథి అధ్యాపకులు

## ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఆగస్టు 23 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించి, రెన్యూవల్ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని ఆ సంఘం (2152) జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల మారుతి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ తీశారు. ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కృష్ణమూర్తి, రాము, యాదగిరి, భిక్షపతి, రాంబాబు, శ్రీకాంత్, స్వాతి, ఆశ్విని, మౌనిక, సునీత, ఉదయశ్రీ పాల్గొన్నారు.

## నిత్య పరిశోధకులు కావాలి

నస్పూర్, ఆగస్టు 23 : విద్యార్థులు నిత్య పరిశోధకులు కావాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర జడ్పీ సెకండరీ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణలు చేసేందుకు సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబు, ఎంఈవో జాడి పోచయ్య, సెక్టోరియల్ అధికారి చౌదరి, హెచ్ఎం రాలు సుధ, కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కాసిపేట మోడల్ స్కూల్‌లో..**

కాసిపేట, ఆగస్టు 23 : కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో అంతరిక్ష దినోత్సవం సందర్భంగా క్విజ్, స్పీచ్, పెయింటింగ్స్, చంద్రయాన్-3 మోడల్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఆర్జేడీ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణరెడ్డి, డీఈవో

## కవ్వాల్‌లో పెద్దపులి సంచారం

జన్నారం, ఆగస్టు 23 : కవ్వాల్ టైగర్ రిజర్వుడు అడవుల్లోని జన్నారం డివిజన్‌లో పెద్దపులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.ఈ మేరకు శుక్రవారం ఎఫ్‌డీవో శివ్‌ఆశీష్ సింగ్, జన్నారం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు ఆదేశాల మేరకు అటవీశాఖ, ఇతర శాఖల అధికారులు సాయంత్రం అటవీ సమీప గ్రామాల్లో ప్రచారం చేశారు. అడవుల్లో పులి తిరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బుధవారం ఆవు దూడ గాయపడ్డ ప్రాంతాన్ని పరిశీలించారు.



పెద్దపులి (ఫైల్)

## కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా శ్రద్ధ శుక్లా



కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 23 : కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్‌గా శ్రద్ధ శుక్లాను సర్కారు నియమించింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని సబ్ డివిజన్‌లకు ఆర్డీవో హోదా కాకుండా ఐఏఎస్ అధికారి స్థాయిలో సబ్ కలెక్టర్ నియామకానికి సంబంధించి గతంలో ఉత్తర్వులు వెలువరించిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం ఐఏఎస్ అధికారిని శ్రద్ధ శుక్లాను కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఆశ్రమ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

నెన్నెల, ఆగస్టు 23 : సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం నెన్నెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల గురించి ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూవంటివి ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం కుష్నపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా అని సిబ్బందిని అడిగారు. బోధనా విధానం గురించి తెలుసుకున్నారు. హైస్కూల్‌ను సందర్శించారు. చిత్తాపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి అక్కడ అసంపూర్తిగా ఉన్న గదులను పరిశీలించారు. నిర్మాణంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్‌ను మందలించారు. వారంలోగా పనులు చేపట్టక పోతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరించారు. నెన్నెల ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీఎం విజయలక్ష్మి ఉన్నారు.

## పిల్లల ఎదుగుదలపై దృష్టి పెట్టాలి

**జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ**

ఆసిఫాబాద్ టౌన్,ఆగస్టు 23 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌తో కలిసి సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పిరామిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ఎస్ఎస్ఎఫ్ఎస్ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో టీహెచ్ఆర్, హెచ్‌సీఎం వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో 100 శాతం నమోదు చేయాలని, పిల్లల ఎత్తు, బరువును సకాలంలో నమోదు చేస్తూ పోషణ లోపమున్న పిల్లలను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త గోపాలకృష్ణ, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ బ్లాక్ సమన్వయకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679